నేడు కేడీసీలో మెగా జాబ్ మేళా

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 25 : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలంగాణ నైపుణ్య శిక్షణ విభాగం(టీఎస్‌కేసీ), ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నవంబర్ 2న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. అపోలో ఫార్మసీ, మెడ్‌ప్లస్, ముత్తూట్, పేటీఎం, థ్రెడ్జ్ ఐటీతో పాటు పదికి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 1500 మందికి అవకాశం ఉందని పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన నిరుద్యోగ యువత తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ రాజశేఖర్, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ యాకూబ్, మెంటార్ సాగర్ పాల్గొన్నారు.

దళారులకు పత్తి విక్రయించొద్దు

పరకాల, అక్టోబర్ 25 : గ్రామాల్లో రైతులు పత్తిని దళారులకు విక్రయించొద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కొంతమంది దళారులు గ్రామాల్లో చిల్లర కాంటాలతో రైతుల వద్ద పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, చిల్లర కాంటాలతో రైతులు మోసపోయే అవకాశం ఉందన్నారు. మద్దతు ధర రాదని, రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. అనధికారంగా గ్రామాల్లో కొనుగోళ్లు చేసే మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

ఎల్కతుర్తి, అక్టోబర్ 25 : మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్, కస్తూర్బా, జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. సుమారు 190 పరీక్ష ప్యాడ్‌లు, 380 పెన్నులను అందజేశారు.

ఉద్యమ కమిటీ ఫోరం మండలాధ్యక్షుడిగా సంపత్

కమలాపూర్, అక్టోబర్ 25 : తెలంగాణ ఉద్యమ కమిటీ ఫోరం మండలాధ్యక్షుడిగా మౌటం సంపత్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సంపత్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఆయన సేవలను గుర్తించి మండల అధ్యక్షునిగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కాగా, సంపత్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, కుమారస్వామి, నాయకుడు మోకిడె ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్స్ పోయినది

నేను అనగా వంచ రామ్ మోహన్ రెడ్డి S/o ఆదిరెడ్డి R/o. 23-6-85.సిగ్నేచర్ హోమ్స్, హంటర్ రోడ్,హనుమకొండ మనవి చేయునది,నేను దిని17-10-2024 రోజున అదాలత్ ప్రాంతంలో ఆటోలో ప్రయాణిస్తూ ఉండగా నాయిక్క భూమి డాక్యుమెంట్లు నెం. 3873/2011,3874/3011 గలవి పోయినవి,కావున ఇట్టి డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి పైన తెలిపిన నా అడ్రస్ లోగాన,కింద తెలిపిన ఫోను నంబరులో గాని సంప్రదించి అందచేయగలరు.
9866552186

CHANGE OF NAME

★I, VINOD KUMAR REDDY ALLAM (OLD NAME), R/o H.No.1-1-218/A/1, prashanthNagar,Waddepally, Hanamkonda Mdl,. Hanumakonda Dist.506004, Hereby I declare that,I have changed My Name to ALLAM VINOD REDDY (NEW NAME).
NTW-425

WANTED

★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333978.
WGL-NT-98842

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- సీపీ అంబర్ కిశోర్ ఝా
- కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం
- ఓపెన్ హౌస్‌లో విద్యార్థులకు అవగాహన

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సుబేదారి, అక్టోబర్ 25 : పోలీస్ అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండలోని కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తుపై స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై స్టేషన్ అధికారులకు ముందస్తు సమాచారం ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే కథనాలపై అధికారులు దృష్టి సారించాలని, అలాగే, వదంతులు వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలపై కన్నేసి ఉంచాలని సూచించారు. నేరాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, యాంటీ డ్రగ్స్ విభాగానికి రివార్డులను అందజేశారు. డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

అమవీరుల త్యాగాలు మరవలేనివి..

పోలీసు అమవీరుల త్యాగాలు మరవలేనివని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శుక్రవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు అన్నారు. ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బాల నేరస్తుల పరిశీలక గృహం తనిఖీ

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి

వరంగల్ లీగల్, అక్టోబర్ 25 : వరంగల్ ఆటోనగర్‌లోని బాల నేరస్తుల పరిశీలక గృహాన్ని న్యాయమూర్తి సాయి కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. చట్ట వ్యతిరేక పనులకు స్వస్తి చెప్పి, క్రమశిక్షణతో కూడుకున్న జీవనం కొనసాగించాలని అక్కడి బాలురకు సూచించారు. విద్యార్థులకు బోధన, మంచి నడవడి నేర్పుతున్న ఉపాధ్యాయుడిని అభినందించారు. గృహ పరిసరాలు, రిజిస్టర్లు, ఆహార సరుకులు, రోజువారీ ఆహార నియమావళి, ఔషధాలు, సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలురకు అందిస్తున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సురేశ్, హోమ్ సూపరింటెండెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి

ఆత్మకూరు, అక్టోబర్ 25 : అగ్రంపహాడ్‌కు చెందిన కూలీ మంద సునీత (50) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సునీత గురువారం కూలి పని చేసేందుకు వరంగల్‌కు వెళ్లింది. పనులు ముగించుకొని ఇంటికి వచ్చేందుకు కాశీబుగ్గ ప్రాంతంలో వాహనం కోసం ఎదురుచూస్తోంది. కాగా, అదే గ్రామానికి చెందిన హోంగార్డ్ పరికి కిషన్ బైక్‌పై ఎక్కి ఇంటికి వస్తుండగా, సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోయింది. వెనకాల కూర్చున్న సునీతకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు తల్లి మల్లికాంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

కాజీపేట, అక్టోబర్ 25 : కాజీపేట రైల్వేస్టేషన్ శివారులోని డీజిల్ లోకో షెడ్డు సమీపంలో ఓ మహిళ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూచింది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బతుకుదెరువు కోసం పత్తి మల్లేశ్-లావణ్య(38) దంపతులు 12 ఏళ్ల క్రితం అయోధ్యపురం వచ్చారు. లావణ్య పట్టణంలోని ఇళ్లల్లో పాచి పనికి వెళ్లేది. ఈ క్రమంలో ఇంటి నుంచి బయలు దేరిన లావణ్య డీజిల్ లోకో షెడ్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ఇంటర్ చదివే కూతురు ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించినట్లు వివరించారు.

ప్రమాదవశాత్తు గ్రానైట్ క్వారీ ఆపరేటర్ మృతి

సుబోద్(ఫైల్)

ఐనవోలు, అక్టోబర్ 25 : గ్రానైట్ క్వారీలో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ కిందపడి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వనమాలకనపర్తిలోని వీరాంజనేయ గ్రానైట్ క్వారీలో బీహార్‌కు చెందిన సుబోద్ యాదవ్(36) ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం క్వారీలో పని చేస్తుండగా కాలు జారి పైనుంచి కిందపడగ, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి అన్న రాజేందర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, సుబోద్ యాదవ్ పని చేస్తుండగా కొద్దిదూరంలో జిలెటిన్ స్టిక్స్(బ్లాస్టింగ్) పేలడంతోనే గాయపడినట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పనుల తనిఖీ

తోటను పరిశీలిస్తున్న అధికారులు

కమలాపూర్, అక్టోబర్ 25 : మండలంలోని ఉప్పలపల్లి, ఉప్పల్, గుండేడు, అంబాల గ్రామాల్లో ఉపాధి హామీ పనులను జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. ఉప్పలపల్లిలో కంది సంపత్ సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. ఉప్పల్ పంచాయతీలో రికార్డులను పరిశీలించి గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చూడాలని ఆదేశించారు. గుండేడులో పెరబోయిన సంపత్ నిర్మించిన పశువుల షెడ్డును చూశారు. అంబాల ఎస్సీ హాస్టల్‌లో కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీడీవో బాబు, ఎంపీవో రవి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

పరకాల, అక్టోబర్ 25 : రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న గురుకులాలకు వెంటనే సొంత భవనాలను నిర్మించి విద్యను బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మడికొండ ప్రశాంత్, బొజ్జ హేమంత్, ఎండీ ఇస్మాయిల్, ఈశ్వర్, పవన్‌కుమార్, అభిషేక్, సాయి, తేజ, రాజేశ్, అనూష, ప్రవళిక, అంజలి, శిరీష పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ఆశ వర్కర్లది ప్రత్యేక స్థానం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఆశ వర్కర్లకు రిజిస్టర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్‌చౌరస్తా, అక్టోబర్ 25: ప్రభుత్వ వైద్య సేవల్లో ఆశ వర్కర్లకు ప్రత్యేక స్థానం ఉందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ ఐఎంఏ హాల్‌లో శుక్రవారం హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆశ కార్యకర్తలకు రిజిస్టర్లు అందజేశారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కుటుంబ సంక్షేమ కేంద్రం ఉన్నట్లు చెప్పారు. 99 మంది ఆశ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో అర్హులైన ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు ఇండ్లు కేటాయించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వరంగల్,అక్టోబర్ 25 : గ్రేటర్‌లోని విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన వర్ధన్నపేట నియోజవర్గ పరిధిలోని డివిజన్ల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష చేశారు. నియోజకవర్గ పరిధిలోని 13 డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, ఎస్సీ సబ్‌ప్లాన్, పట్టణ ప్రగతి, గ్రీన్‌ఫండ్, స్మార్ట్‌సిటీలతో 2023 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై చర్చించారు. 13 డివిజన్లలో రూ. 60.67కోట్లతో 409 పనులు మంజూరు చేశామని, వాటిలో రూ.18.36 కోట్లతో చేపట్టిన 198 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. రూ. 11.42 కోట్లతో చేపట్టిన 48 పనులు పురోగతిలో ఉన్నాయని, 21 పనులు ఆగ్రిమెంట్‌లు అయ్యాయని, 96 పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, మరో 40 పనులకు టెండర్లు పిలువాల్సి ఉందని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే నాగరాజు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే వెంటనే వాటిని రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలువాలన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరుగాలన్నారు. మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీలో భాగంగా నియోజవర్గంలో రూ.114 కోట్లతో 21 ప్రాజెక్టులు చేపట్టామన్నారు. ఇప్పటికే 5 ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెప్పారు. అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాదేకర్, కుడా ఈఈ భీమ్‌రావు, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు..

ఐనవోలు : వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు ఒంటిమామిడిపల్లి పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ, పేరెంట్స్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలకు 8 మంది స్కూల్ అసిస్టెంట్లను కేటాయించేందుకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ తిరుమల్‌రావు

హసన్‌పర్తి, అక్టోబర్ 25 : విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకొని, పైచదువుల కోసం విదేశాలకు వెళ్లేందుకు బాటలు వేసుకోవాలని ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు సూచించారు. భీమారంలోని ఎస్వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌లో వివిధ దేశాలకు చెందిన పలు యూనివర్సిటీల ప్రతినిధులతో అటానమస్ గ్లోబల్ లీడర్ మీట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం శుభసూచకమని, విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని, తల్లిలాంటి భాతరదేశంలో పెద్ద కంపెనీలు ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. ఎక్స్‌స్టెప్ మేనేజింగ్ డైరెక్టర్ నిషితారావు విద్యార్థులకు పైచదువులకు అవసరమైన పలు సూచనలు, లోన్ సౌకర్యంపై వివరించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా వెల్స్పైరింగ్ రీజినల్ మేనేజర్ పాలకుర్తి శ్రీకాంత్, మార్కెటింగ్ మేనేజర్ అనుషాగుప్తా (డెమాంట్‌ఫార్డ్ యూఎస్ఏ), మార్కెటింగ్ మేనేజర్ శశిధర్‌రెడ్డి, (ఎవెల్ యూనివర్సిటీ. యూకే), సీనియర్ మేనేజర్ జోత్స్న (కావెంట్రీ యూనివర్సిటీ), పైలా (ఎస్టన్ యూనివర్సిటీ) పాల్గొన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత : అదనపు కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 25 : భూగర్భ జలాల పరిరక్షణపై ప్రతి ఒక్కరికి బాధ్యత ఉందని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి హోటల్, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, కమర్షియల్ కాంప్లెక్సులోనూ నీటి సరఫరాపై నిరంతర నిఘా ఉండేలా చూడాలన్నారు. జిల్లా భూగర్భ జల అధికారి శైలశ్రీ మల్లికాదేవి మాట్లాడుతూ ప్రతి నెల భూగర్భ జల శాతం పరీక్ష చేసి రాష్ట్రానికి నివేదిక పంపుతున్నామన్నారు. ప్రతి నెలా 25వేల లీటర్లు పైబడి వాడితే తప్పకుండా డిజిటల్ ఫ్లో మీటర్ అమర్చుకోవాలన్నారు. ఎవరికైనా అవసరం ఉంటే gwrms.telangana.gov.in వెబ్‌సైట్‌లో లేదా భూగర్భ జలాల ఆఫీసులో అనుమతి తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను కలుషితం చేసే అవకాశమున్న పరిశ్రమలు ఎలాంటి రీచార్జ్ చర్యలు చేయొద్దని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో నారాయణ, తహసీల్దార్లు భావుసింగ్, వెంకట్ భాస్కర్, విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈ జగదీష్ బాబు, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలి

ధర్మసాగర్/న్యూశాయంపేట, అక్టోబర్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బొడ్డు శాంతిసాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భిక్షపతి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అమలు చేయకుండా మాదిగ జాతిని వంచిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణ చేయకుండనే ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరికాదనన్నారు. ఈ నెల 26న హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో మాదిగల ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గంగారపు శ్రీనివాస్, సతీశ్, దినేశ్, ప్రశాంత్, రాజు, బాబు, హరిబాబు, ప్రదీప్, తిలక్, ఖాజా, పరమేశ్ పాల్గొన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అమలు చేయకుండా మాదిగ జాతిని వంచనకు గురిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై ధర్మయుద్ధం చేసేందుకు మాదిగజాతి సిద్ధం కావాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ కోరారు. న్యూశాయంపేటలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డల సుకుమార్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నేత వేల్పుల సూరన్న, మున్నూరుకాపు, బొడ్డు దయ, రాష్ట్ర నాయకులు మండ రాజు, రవి, చేతాళ్ల శివ పాల్గొన్నారు.

'బల్దియా ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలివ్వాలి'

వరంగల్, అక్టోబర్ 25 : మున్సిపల్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి జలీల్ కోరారు. శుక్రవారం నగరంలోని పోతన ఆడిటోరియంలో జిల్లా అధ్యక్షుడు పాశం రవి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా మహా సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే పీఆర్‌సీలో కనీస మూల వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల విద్యార్హతలను గుర్తించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు వేల్పుల ధర్మరాజు, బొట్ల భిక్షపతి, రాంచంద్రరావు, కొమ్ము జ్ఞానేందర్, సంజీవరెడ్డి, బైరబోయిన గట్టయ్య, కందిక కోర్నేల్, రఘు, మేకల దేవేందర్, సారయ్య, సునీత శేఖర్, సత్యనారాయణ, నల్ల నర్సింహ, జన్ను రాజేశ్, దయాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు బీసీ సంఘాలతో సమావేశం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 25 : తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ నవంబర్ 2న జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ కుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కులాలకు సంబంధించిన, ఆసక్తి కలిగిన ప్రతినిధులు వారివారి కులాల్లోని రాజకీయ, సామాజిక, ఆర్థికపరమైన అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలు తదితర అంశాలపై చర్చించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీసీ కుల సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి

ర్యాలీగా వస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

హనుమకొండ, అక్టోబర్ 25 : సమాజంలోని అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణలో జరిగింది. ముందుగా బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి కాళోజీ జంక్షన్, అమరవీరుల జంక్షన్, సుబేదారి మీదుగా ఆడిటోరియం వరకు విద్యార్థులతో ర్యాలీ తీశారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ 1974లో ఓయూ వేదికగా జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్ నాయకత్వంలో పీడీఎస్‌యూ ఏర్పడి దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో మెడికల్ కాలేజీల ఏర్పాటును వ్యతిరేకించి ప్రభుత్వాలను గద్దెదింపిన చరిత్ర పీడీఎస్‌యూకు మాత్రమే ఉందన్నారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనం, మహిళలపై అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా ప్రాణాలను ఎదురొడ్డి నిలబడ్డ సంస్థ అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దినేశ్‌కుమార్, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాపరెడ్డి, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్న అప్పార